

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 7 మార్చి 2025





క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

రాయికల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్-4 ను సందర్శించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు అప్రమత్తతో ఉండాలని విజిలెన్స్ ట్రాన్స్‌కో ఇన్‌స్పెక్టర్ బాబా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు మీటర్లు తిరగకుండా చేస్తామని, తద్వారా కరెంటు బిల్లు ఆదా అవుతుందని చెప్పి మాయ మాటలు చెప్పి విద్యుత్ వినియోగ దారుల నుంచి డబ్బులు వసూలు చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వ్యక్తుల మాయమాటలు నమ్మి మోస పోవద్దని, ఎవరైనా వచ్చిన యెడల తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమీప పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయాలని కోరారు.

విధుల నుంచి ఉపాధ్యాయురాలి తొలగింపు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఖాజీపుర ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో లాంగ్వేజ్ పండిట్(ఉర్దూ)గా పనిచేస్తున్న ఫహీమ్ జహాన్‌ను విధులనుంచి తొలగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాము తెలిపారు. 1.11.2022 నుంచి అనధికారికంగా విధులకు గైర్హాజరు అవుతున్నందున సర్వీసు విధులనుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అనధికారికంగా పాఠశాలలకు గైర్హాజరైతే చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు.

బ్రహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వెల్గటూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం ఆయన క్యాంప్ ఆఫీసులో ఆవిష్కరించారు. ఈనెల 10 నుంచి నిర్వ హించే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అజయ్, గౌరవ అధ్యక్షులు వెంకటేష్, పూదరి రమేష్, సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో కొలువులు

- జిల్లాలో పోస్టుల భర్తీకి కసరత్తు
- 63 టీచర్, 318 ఆయా పోస్టులు ఖాళీ
- మారిన విద్యార్హత నిబంధన
- మహిళా దినోత్సవం రోజున నోటిఫికేషన్ జారీకి కసరత్తు

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కొలువులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు వీలుగా అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు (ఆయా) పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. జిల్లాలో పలు కారణాలతో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులను కొన్ని సంవత్సరాలుగా భర్తీ చేయడం లేదు. కొందరు టీచర్లకు అదనపు కేంద్రాలను అప్పగించగా విధులు నిర్వర్తిస్తున్నారు. సిబ్బంది కొరత ఉన్న కేంద్రాల నిర్వహణ సూపర్‌వైజర్లకు, సీడీపీఓలకు ఇబ్బందిగా మారింది. ఖాళీలను భర్తీ చేస్తే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మెరుగుపడే అవకాశం ఉంది.

● జిల్లాలో ఖాళీల వివరాలు

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, మల్యాల, ధర్మపురిలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,065 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు మంజూరు కాగా 1,002 పోస్టులు భర్తీ అయి ఉన్నాయి. ఇంకా 63 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలో 1,065 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు మంజూరు కాగా 747 పోస్టుల్లో ఆయాలు పనిచేస్తున్నారు. ఇంకా 318 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ధర్మపురి ప్రాజెక్టు పరిధిలో 222 టీచర్ పోస్టులకు గాను 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 222 ఆయా పోస్టులకు గాను 86 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జగిత్యాల ప్రాజెక్టు పరిధిలో 304 టీచర్ పోస్టులకు గాను 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 304 ఆయా పోస్టులకు గాను 97పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మల్యాల ప్రాజెక్టు పరిధిలో 227 టీచర్ పోస్టులకు గాను 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 227 ఆయా పోస్టులకు గాను 49పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెట్‌పల్లి ప్రాజెక్టు పరిధిలో 312 టీచర్ పోస్టులకు గాను 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 312 ఆయా పోస్టులకు గాను 86 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



అంగన్‌వాడీ స్కూల్‌లో పిల్లలతో టీచర్

● మంత్రి సీతక్క ప్రకటనతో ఆశలు

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనరి అనసూయ సీతక్క అంగన్‌వాడీటీచర్, ఆయా పోస్టుల భర్తీపై ఇటీవల చేసిన ప్రకటన నిరుద్యోగ యువతుల్లో ఆశలు చిగురింపజేశాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న సుమారు 14వేలకు పైగా అంగన్‌వాడీ టీచర్, ఆయా నియామకాల ప్రక్రియ ప్రారంభించ నున్నట్లు మంత్రి సీతక్క ప్రకటిచారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు గతంలో పదోతరగతి ఉత్తీర్ణత కావాలన్న నిబంధన ఉంది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం అంగన్‌వాడీ టీచర్‌తో పాటు ఆయా పోస్టుకు కనీసం ఇంటర్ పాసై ఉండాలన్న నిబంధన ఉందని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

ఖాళీల వివరాలను గుర్తించాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల వివరాలను గుర్తిం చాం. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సమీపం లో ఉన్న కేంద్రాల నుంచి టీచర్లను, ఆయాలను సర్దుబాటు చేశాం. సూపర్‌వైజర్లతో నిరంతర పర్య వేక్షణ చేస్తున్నాం. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లు కలగకుండా చర్యలు చేపడుతున్నాం.



-బోనగిరి నరేశ్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురి డీబార్

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ తెలిపారు. జిల్లాలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇరువురు విద్యార్థులు, కోరుట్ల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంలో ఒకరు విద్యార్థి మాల్ ప్రాక్టీస్ చేస్తుండగా డీబార్ చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ పరీక్షలో 97.8శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో 6,387మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 6,259 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. 128మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్ పరీక్షల సందర్భంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో పది మంది కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్లు, పది మంది డిపార్ట్‌మెంట్ అధికారులకు కలెక్టర్ సత్య ప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచిన పరీక్ష పేపర్లను ఆయా కేంద్రాలకు తరలించే సమయంలో, ఆన్సర్ బుక్ బెండల్స్‌ను కేంద్రాల నుంచి పోస్టాఫీస్‌లకు తరలించే సమయంలో ఫోర్‌వీలర్‌లో తరలించాలని ఆదేశించినప్పటికీ నిర్లక్ష్యం వహించారన్న కారణంతో షోకాజ్‌లు అందించారు. కారులో పరీక్ష పేపర్లను, ఆన్సర్‌బుక్ బెండల్స్‌లను తరలించలేదన్న ఆరోపణలతో మల్లాపూర్ సీఎస్ సత్యనారాయణ, డీఓ శ్రీనివాస్ కోరుట్ల బాలికల ప్రభుత్వ కళాశాల కేంద్ర సీఎస్ దుర్గ, డీఓ దుర్గ, కొడిమ్యాల సీఎస్ బాలక్రిష్ణరెడ్డి, డీఓ నర్సింగం, జగిత్యాల అల్ఫోర్స్ జూనియర్ కళాశాల కేంద్రాల సీఎస్‌లు నర్సయ్య, డీఓ సంధ్య, సీఎస్ నరేందర్, డీఓ రాజేందర్, నేతాజీ ఒకేషనల్ జూనియర్ కళాశాల కేంద్ర సీఎస్ రాజేంద్ర ప్రసాద్, డీఓ గంగాధర్, చైతన్య జూనియర్ కళాశాల కేంద్ర సీఎస్ నరేశ్, డీఓ రాజశేఖర్, ఎస్ఎస్‌వీ జూనియర్ కళాశాల కేంద్ర సీఎస్ మహేశ్వరీ, డీఓ సుదర్శన్, మెట్‌పల్లి అరోరా జూనియర్ కళాశాల కేంద్ర సీఎస్ మోయి జోద్దిన్, డీఓ దినేశ్, జగిత్యాల వైష్ణవి జూనియర్ కళాశాల కేంద్ర సీఎస్ సుబ్రహ్మణ్యం, డీఓ ప్రతిభలకు షోకాజ్ నోటీసును కలెక్టర్ సత్యప్రసాద్ జారీ చేశారు.

'నోటీసులను ఉపసంహరించుకోవాలి'

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణలో 20 మంది అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ జారీచేసిన షోకాజ్ నోటీసులను వెంటనే ఉప సంహరించుకోవాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్- 475 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం జగిత్యాలలో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులకు వినతిపత్రాలను అందించడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా వినతిపత్రాలను పంపించామన్నారు. ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు, సమాధాన పత్రాలను పరీక్ష కేంద్రాల నుంచి పోస్టు ఆఫీస్‌లకు త్రీవీలర్ వాహనాల్లో తీసుకెళ్లడంపై షోకాజ్ నోటీసులు జారీ చేయడం విచారకరమన్నారు. ఫోర్‌వీలర్‌ను వినియోగించడానికి సిబ్బందికి అదనపు ఆర్థిక భారం అవుతుందని వాపోయారు. వెంటనే నోటీసులను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):బీడీ కార్మికులకు కరువు భత్యం కింద 10-40 పైసలకు పెరిగిందని తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్రఅధ్యక్ష కార్యదర్శులు మోత్కూరి సుధీర్ కుమార్, సిలువేరి కిష్టయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘాలతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం జనవరి 2024 నుంచి డిసెంబర్ 2024 వరకు వినిమయ ధరల పెరుగుదలకు అనుగుణంగా 1809 పాయింట్ల నుంచి 1903 పాయింట్లకు అంటే 104 పాయింట్లు పెరిగిందన్నారు. ఈ లెక్కన వెయ్యి బీడీలకు రూ.261.17, ఈఅగ్రిమెంటు ప్రకారం బీడీప్యాకర్‌లు, నెలసరి ఉద్యోగులకు రోజుకు 10-40 పైసల చొప్పున నెలకొక్కంటికీ రూ.312 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పెరిగిన భత్యం రేట్లు 1.04.2025 నుంచి రాష్ట్రంలోని బీడీ యాజమాన్యాలు కార్మికులకు చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు. ఈ విషయాన్ని బీడీ కార్మికులు గమనించాలని కోరారు.

జిల్లాలో సిటీ పోలీస్ యాక్ట్

జగిత్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఈనెల చివరి వరకు సిటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించ కూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

'పసుపు కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు'

మెట్‌పల్లి రూరల్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు, వ్యాపారస్థులను కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. గురువారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో పోసిన పసుపు కుప్పలను పరిశీలించారు. పసుపు కొనుగోళ్లను ఎలా చేస్తున్నారని, ఎక్కడికి ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్నారని వ్యాపారస్థులను అడిగి తెలుసుకున్నారు. లైసెన్స్ వ్యాపారస్థులు, దళారులు పసుపు ఏవిధంగా యాక్షన్ చేస్తారని ప్రత్యేకంగా వేలం వేయించి పరిశీ లించారు. కుప్పలను పరిశీలించి పసుపును పగలగొట్టి చేతితో విరిచి ఎండిందా లేదా అన్నది మాత్రమే చూస్తా మని వ్యాపారస్థులు తెలిపారు. ఇందులో నాణ్యమైన క్వింటాల్ పసుపుకు మద్దతు ధర రూ.8వేల నుంచి 10వేలకు వరకు, రెండవ రకానికి ధర రూ.7వేల నుంచి 8వేల వరకు, మూడవ రకానికి రూ.4వేల నుంచి 6వేల ధరకు కొనుగోలు చేస్తామని వ్యాపారస్థులు తెలిపారు. ఈ విధంగా అయితే రైతులు నష్టపోయే పరిస్థితి ఉందని వారిని ప్రశ్నించారు. రైతుకు గిట్టుబాటు ధర రావడానికి నాణ్యత తెలిపే సాంకేతిక యంత్రాలు మార్కెట్‌కు తీసుకురావాలని మెట్‌పల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి కలెక్టర్‌కు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా రైతులతో మాట్లాడి ఎంత భూమి ఉందని, ఎన్ని రకాల పంట వేశారని, ఎంత పసుపు పండించారని కలెక్టర్ అడిగారు. పసుపునకు మద్దతు ధర ఎలా ఉందని, లాభం వస్తుందా, నష్టం వస్తుందా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం తక్కువ ధర పలుకుతోందని దీంతో నష్టపోతున్నామని రైతులు తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డులో పసుపు అమ్మకాలు ఎలా జరుపుతున్నారని ఆన్‌లైన్ ప్రక్రియను నేరుగా పరిశీలించి, అమ్మకాలు ఆన్‌లైన్ ద్వారా చేసి రైతులకు మంచి ధరను చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్, మెట్‌పల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, సీఈవో ఇంద్రసేనరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఉమేష్ ఉన్నారు.



మెట్‌పల్లి మార్కెట్‌కు వచ్చిన పసుపును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మహిళల హక్కుల సాధనకు ప్రత్యేక చట్టాలు

● ముందస్తు మహిళా దినోత్సవంలో కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలకు సమానమైన హక్కులతో పాటు ప్రత్యేక చట్టాలని ప్రభుత్వం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గెజిటెడ్ మహిళా అధికారులు ఉత్సాహంగా వేడుకలు జరిపారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఆటల పోటీలు, రంగవల్లులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా జరిగిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడారు. గృహ హింస నిరోధక చట్టం, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివా రణ చట్టం, నిర్భయచట్టం వంటి వాటి ద్వారా మహిళలు హింసలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. అనంతరం పలువురు మహిళా అధికారులకు జ్ఞాపికలను అందించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీటీఓ షఫీయ, డీపీఓ సుజాత, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి సత్యమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారిణి సుజాత, అసోసియేషన్ చైర్‌పర్సన్ జి రచన, కన్వీనర్ లావణ్య, కోకన్వీనర్ ఉమేశ్వరీ పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు జరిపారు. కళాశాలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు ఉత్సాహంగా వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వాసవి, కుమారి, నీరజ, సంగీతరాణి, సుజాత, శ్రీలత, జమున, సునీ, జ్యోత్స్న, రక్షిత, ఇర్ఫాన, గీత తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామంలో గల ముదిరాజ్ కాలనీలో రూ 5 లక్షలు విలువ గల సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమ య్యాయి. కాలనీలో రోడ్డు అధ్వాన్న స్థితిలో ఉండగా కాలనీవాసులు ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ 5 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంతాపూర్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు రాజేందర్ యాదవ్, సుద్దాల నరేష్, దాసరి రాజయ్య, తిరుపతిగౌడ్, సర్దసాయికిరణ్, గడ్డం సత్యనారాయణ, సుద్దాల తిరుపతి, కుంటాల రాజమల్లు, ర్యాగల్ల సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కథలాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణాలకుగాను ఉపాధిహామీ పథకం కింద రూ.1.23 కోట్లు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ప్రతి పాదనల మేరకు నిధులు మంజూరైనట్టు చెప్పారు.

బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 10 నుంచి ప్రారంభం అయ్యే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించే స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనే గల శ్రీ మఠం యాగశాల స్థలాన్ని ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారుల సలహాలు, అభ్యర్థనల మేరకు మొదటి సారి స్వామి వారల కల్యాణోత్సవాన్ని దేవాలయం లోపల శేషప్ప కళావేదికపై గాకుండా బయట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. మంచి నీరు, మొబైల్ టాయిలెట్స్, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులు సమన్వయంతో పని చేసి ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఆగమ శాస్త్రం, వేదపండితుల సూచనలు, సలహాల మేరకు సమయానుకూలంగా కల్యాణోత్సవాన్ని పూర్తి చేయాలని ఆయన తెలిపారు. స్వామి వారి కల్యాణం అనంతరం ఆ స్థలం చుట్టు కంచె వేసి కేవలం స్వామి వారి కళ్యాణం కోసం మాత్రమే ఆ స్థలాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు ఆయన స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు. స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ఆలయ వేదపండితుల ఆయనను ఘనంగా ఆశీర్వచనం చేయగా అర్చకులు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు. ఆయన వెంట ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్, వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్, జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.



కల్యాణ వేదిక ఏర్పాట్లపై చర్చిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

జగిత్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఆర్ఎస్‌పీ క్యాంపు శివారులో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బీఎస్ లతలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈవీఎం గోదాంను సందర్శించి పరిశీలన జరిపారు. ప్రతీ నెల చేసే తనిఖీల్లో బాగంగా ఈవీఎం గోదాంను కలెక్టర్ సత్య ప్రసాద్ సందర్శించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈవీఎంల భద్రత పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీఓ మధు సూదన్, తహసీల్దార్ రాంమోహన్ పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి
● బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన
ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి 8
● ఎస్పీ అశోక్‌కుమార్

వాహనాల నియంత్రణకు 'స్టాపర్ల' ఏర్పాటు

మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజ నేయ దేవ స్థానం పరిధిలో వాహనాల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆలయ ఆవరణలో మూడుచోట్ల స్టాపర్లు ఏర్పాటు చేయిస్తున్నారు. ఆంజనేయ స్వామి దర్శనంకు వచ్చే ప్రముఖులు, అధికారులు తదితరుల కార్లు ఇతరత్రా వాహనాలు ఇన్నాళ్లు నేరుగా ఆల యం ముందు నుంచే సానా కాటేజ్ (పాత కార్యాలయం) వరకు వెలుతుండడం, ఆలయం ముందే వాహనాలు నిలుపడంతో భక్తులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. భక్తుల ఇబ్బందులు గుర్తించిన అధికారులు స్టాపర్ల ఏర్పా టుకు ముందుకు వచ్చారు. ఇందులో బాగంగా పోలీస్ అవుట్‌పోస్టు, సీతమ్మ కన్నీటి గుంతలు, ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ద్విచక్రవాహనాలు మినహా ఇతర వాహనాలు గుడి ముందుకు వచ్చే అవకాశం లేదు. భక్తులతో పాటు ఆలయ పరిపాలన వ్యవస్థకు వాహనాల నియంత్రణ ప్రయోజనకరంగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మధుర ఫలం ఖర్జూరం

● పరిపూర్ణ ఆరోగ్యం, సౌందర్యానికి వరం
● రంజాన్ సంప్రదాయ ఫలం ● పోషకాలు ఎన్నో..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు ఉన్న ఎడారి పండు ఖర్జూరం. ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్న ఖర్జూర ఫలంతోనే ముస్లింలు రంజాన్ మాసంలో ఉపవాసాన్ని విరమిస్తారు. మహ్మద్ ప్రవక్త ఖర్జూర ఫలాన్ని ఎంతో ఇష్టంగా ఆరగించేవారని, అందుకే ఖర్జూర ఫలం ముస్లింలకు సంప్రాదాయ ఫలంగా మారిందని చెబుతారు. అందుకే సాధారణ రోజుల్లో ఖర్జూరం మార్కెట్‌లో తక్కువగా కనిపించినా రంజాన్ మాసంలో ఎక్కువగా దిగుమతి అవుతాయి.

40 రకాల ఖర్జూర పండ్లు ఇప్పుడు మార్కెట్‌లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. గల్ఫ్ దేశాల నుంచి అందులో అత్యధికంగా సాగుచేసే ఇరాక్, ఇరాన్, సౌదీఅరబ్, యెమెన్, అల్జీరియా, మొరాకో దేశాల నుంచి 80శాతం వరకు హైదరాబాద్, బెంగుళూర్ వంటి నగరాలకు లక్షలాది టన్నులు దిగుమతి అవుతుంది. ఖర్జూర పండ్లలో అత్యంత ఖరీదైదని అజ్వా ఖర్జూరం కిలో రూ.1800 నుంచి రెండు వేల వరకు ధర పలుకుతుంది. మిగతా రకాలు రూ.60 నుంచి రూ.600 వరకు ఉంటాయి. ఖర్జూరం రుచికరంగా ఉండడమే కాకుండా పోషకాలు మెండుగానే ఉంటాయి.



ఖర్జూరం నిల్వ ఉంచుకునే పద్ధతి..

ఖర్జూరం పండ్లు ఎంతో రుచిగా ఉంటాయి. వీటిని నిల్వ ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. గాలి చొరబడకుండా డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో ఉంచితే ఖర్జూరం పండ్లు నెలరోజులు నిల్వ ఉంటాయి. ఎక్కువ ఖర్జూరాలు నిల్వ ఉంచుకోవాలనుకుంటే మరికొన్ని పద్ధతులు ఉంటాయి. ఖర్జూరాలు ప్రాసెసింగ్ ద్వారా పంచదార, జామ్, జెల్లి, జ్యూస్, సిరప్‌గా మార్చి విక్రయిస్తుంటారు.

ఖర్జూరంలో ఉండే పోషకాలు..

ఖర్జూర పండ్లలో పోషకాలు, ఔషధ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇందులో గ్లూకోజ్, ఫ్రూటోజ్ వంటి ప్రకృతి సిద్ధమైన చక్కెర పదార్థాలు ఉంటాయి. దీంతో శరీరంలో త్వరగా కలిసిపోయి శక్తినిస్తాయి. వంద గ్రాముల ఖర్జూర పండ్లలో నీరు 15.3 శాతం, ప్రోటీన్‌లు 2.5 శాతం, కొవ్వు 0.4 శాతం, కార్బొహైడ్రేట్ 75.8 శాతం ఉంటాయి. 120ల మిల్లీ గ్రాముల కాల్షియం, 50 మిల్లీగ్రాముల పాస్పరసం, 7.3 మిల్లీ గ్రాముల ఇనుము, 3 మీల్లీగ్రాముల విటమిన్ సీ, కొంత విటమిన్ బీ వంటివి ఉంటాయి. ఖర్జూరం ద్వారా కొలస్ట్రాల్ పెరుగుతుందనే భయం కూడా లేదు. వంద గ్రాముల్లో 315 క్యాలరీలు ఉన్నాయి.

మహిళలకు ఎంతో ఉపయోగం..

ఆరోగ్యం, సౌందర్యాన్ని పెంచే ప్రకృతి ఫలమైన ఖర్జూరం మహిళలకు ఎంతో ఉప యోగపడుతుంది. మహిళల్లో పోషక లోపం ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరం వారికెంతో శక్తిని స్తుంది. ప్రతిరోజు గ్లాసు పాలతో ఖర్జూరాలను తింటే పరిపూర్ణ ఆరోగ్యాన్ని స్తుంది.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లి తండాకు చెందిన అజ్మీరా రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని అజ్మీరా రాంసింగ్ ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రహదారి పనులను ఈనెల 4న స్థానిక వాటర్ ట్యాంకు నుంచి కెనాల్ వరకు చేపట్టాడని పేర్కొన్నారు .అదేరోజు అజ్మీరారాజు తన వ్యవసాయ పొలం నుంచి ఎందుకు సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారని రాంసింగ్ భార్య లక్ష్మీ, అతని కొడుకు సాయి కుమార్‌లను ప్రశ్నించాడని చెప్పారు. అంతటితో ఆగని అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు రోడ్డు పనులు చేస్తే చంపి వేస్తానంటూ దాడికి దిగాడని తెలిపారు. బాధితుడు రాంసింగ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

ప్రాణం తీసిన ఇసుర్రాయి వివాదం

● గోదావరిఖనిలో వృద్ధురాలి ఆత్మహత్య

కోల్‌సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గోదావరిఖని రమేష్‌నగర్‌లో ఇసుర్రాయి (తిరగలి) విషయంలో తలెత్తిన వివాదం ఒక వృద్ధురాలి ఆత్మహత్యకు దారి తీసింది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెర్ల యశోద(65) గోదావరిఖని రమేష్‌నగర్‌లో నివాసం ఉంటోంది. ఆమె ఇంటికి పొరుగున ఉండే మాశెట్టి కళావతి ఇంట్లో ఇటీవల శుభకార్యం జరిగింది. ఆ శుభకార్యానికి యశోద ఇంట్లోని ఇసుర్రాయిని తీసుకెళ్లారు. రోజులు గడిచినా ఇవ్వకపోవడంతో తిరిగి ఇవ్వమని యశోద అడిగింది. అది కనిపించడం లేదని వారు దురుసుగా సమాధానం చెప్పారు. ఈ విషయమై కళావతి, యశోద మధ్య గురువారం గొడవ జరిగింది. కళావతి కోడలు రమ్యశ్రీ అక్కడికి వచ్చి యశోదను తిట్టింది. కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీ కలిసి యశోదను నెట్టివేయడంతో ఆమె కిందపడిపోయింది. స్థానికులు యశోదను లేపి ఇంట్లోకి పంపారు. కాలనీవాసుల ముందు తనను అవమానపరిచారనే మనోవేదనతో యశోద ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. యశోద కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు మాశెట్టి కళావతి, ఆమె కోడలు రమ్యశ్రీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ భూమేష్ తెలిపారు.



పల్లెర్ల యశోద(ఫైల్)

గొర్రెలు మాయంపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ముగ్గురు మాంసం విక్రయదారులకు చెందిన ఐదు గొర్రెలు మాయంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్యాల్‌కార్ శ్రీకాంత్, మిర్యాల్‌కార్ రాజేశ్, మిర్యాల్‌కార్ ఐలోజీలు కలిసి 14 గొర్రె పొట్టేళ్లను వెంకటాపూర్ సంతలో కొనుగోలు చేసి వారి మందలో విడిచిపెట్టారని తెలిపారు. ఈ నెల 4న మందను అదే గ్రామానికి చెందిన ఒగ్గు ఎల్లయ్య మేత కోసం రెండవ బైపాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్లాడు. సాయంత్రం గొర్రెల షెడ్డుకు చేరుకున్న మందలోని 5 గొర్రెలు కనిపించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు రూ.50వేల విలువైన తమ జీవాలను అపహరించారని పేర్కొంటూ బాధితుడు మిర్యాల్‌కార్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు. కాగా మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి పోలీసులు ఐదు గొర్రెలను స్వాధీనపర్చుకుని తమకు అప్పగించారని బాధితులు పేర్కొన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య

- రెండు గ్రామాల్లో విషాదం

చొప్పదండి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన చొప్పదండి మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ప్రేమికులు ఇద్దరు చొప్పదండి మండలానికి చెందినవారు. చిట్యాలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్‌కుమార్ కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. భూపాలపట్నంకు చెందిన నాంపల్లి అలేఖ్య కరీంనగర్‌లో డిగ్రీ చదివింది. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారగా అలేఖ్యకు ఇటీవల పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. దీంతో తమ పెళ్లి కాదు అనుకొని ప్రేమికులు ఆత్మహత్యకు పాల్పడడం విషాదాన్ని నింపింది. అలేఖ్య తండ్రి బతుకుదెరువు కోసం గల్ఫ్‌లో ఉంటుండగా, కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రి తల్లడిల్లిపోతున్నారు. మరికొద్ది రోజుల్లో పెళ్లి చేద్దామనుకున్న అలేఖ్య, అరుణ్ కుమార్ మరణ వార్త ఇరువురి కుటుంబాలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామలక్ష్మణపల్లె గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై సీహెచ్ గణేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి నిర్వహించారు. పొలాల వద్ద పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.13,340 తోపాటు కారు, నాలుగు బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. పీసీలు సంతోష్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

- మరో యువకుడికి తీవ్రగాయాలు

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద గురువారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఉదయ్(25) అనే యువకుడు మృతి చెందాడు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన ఉదయ్, మరో యువకుడు మంథనిలో జరిగిన తన స్నేహితుడి చెల్లి పెళ్లికి వచ్చారు. అనంతరం రాత్రి ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో స్నేహితుడి ఇంట్లో పడుకోవటానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బిట్టుపల్లి గ్రామ సమీపంలోని మూల మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడగా ఉదయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సబ్బితం గ్రామానికి చెందిన పెర్క రాయమల్లు (57) అనే వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు భార్య కొంతకాలం క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగగా స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

● విధుల్లో నిర్లక్ష్యం వహించాడని కలెక్టర్ వేటు

కోరుట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహించడం, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు గౌరవ పారితోషికం పంపిణీలో జాప్యం వహించడం తదితర కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బ్యాంకు ఖాతాల్లో సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు సంబంధించిన బడ్జెట్‌ను జమ చేసినప్పటికీ వారి ఖాతాలకు బదిలీ చేయడంలో నిర్లక్ష్యం వహించాడని, శానిటేషన్ నిర్వహణపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనుమతి లేని లే అవుట్‌ను నిరోధించడంలో విఫలం కావడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేయడంలో నిర్లక్ష్యం వహించాడన్న కారణాలతో కమిషనర్ తిరుపతిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన స్థానంలో కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణకు పూర్తి అడిషనల్ చార్జిని అప్పగిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

హత్య కేసు నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్ మార్చి 6 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని తారక రామ్‌నగర్ గ్రామానికి చెందిన ఎస్‌కే రఫీ(28) అనే వ్యక్తి ఈ నెల1 టీఆర్‌నగర్ శివారు ఎస్సారెస్పీ కాలువ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. దీంతో తండ్రి ఎస్‌కే రజాక్ తన కుమారుడు అనూమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా. దర్యాప్తు చేపట్టిన పోలీసులు రఫీక్ హత్యకు గురైనట్లు విచారణ జరిపి నిందితులను గుర్తించారు. హత్యకు పాల్పడ్డ నిందితులైన మహమ్మద్ రంజానీ, షేక్ మహమ్మద్, షేక్ శాదవ్‌లను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి సీఐ నీలం రవి, మల్యాల సీఐ పేర్కొన్నారు.

ఆయుర్వేద వైద్యం పేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● తెలుగు రాష్ట్రాల్లో 50 మందిని నమ్మించి రూ.6 లక్షలు వసూలు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి

సిరిసిల్ల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న కర్ణాటక రాష్ట్రం చిక్కబల్లాపూర్ జిల్లా గౌరీబిందనూర్ తాలూకా నగిరెగెరే గ్రామానికి చెందిన అజయ్ (20) అనే నకిలీ వైద్యుడిని గురువారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అజయ్ అనే నకిలీ వైద్యుడు తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్రవాహనంపై సంచరిస్తూ అనారోగ్యానికి గురైన అమాయక ప్రజల వద్దకు వెళ్లి వారికి ఉన్న పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో తగ్గిస్తామంటూ రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసి మళ్లీ వచ్చి వైద్యం చేస్తానని చెప్పి వెళ్లిపోతుంటాడు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని అనంతపూర్, మహబూబ్ నగర్, నారాయణఖేడ్, రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని వివిధ గ్రామాల్లో నిందితుడు సంచరిస్తూ అమాయక ప్రజలను నమ్మి మోసం చేస్తుంటాడు. ఇదే విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, శాత్రాజపల్లి, ముస్తాబాద్ మండలంలోని బద్నకల్, వెంకట్రావుపల్లిలో తిరుగుతూ నవంబరు 12, 2024న గంభీరావుపేట మండలంలోని లింగన్నపేటకు వచ్చి కొడిమోజు లక్ష్మి భర్త ప్రభాకర్‌కు పక్షవాతం ఉందని తెలుసుకొని వారింటికి వెళ్లాడు. వ్యాధిని నయం చేస్తానని నమ్మించి ఆమె దగ్గర రూ.20 వేలు ఫోన్‌పే చేయించుకోవడమే కాకుండా బ్లాంకెట్లను తీసుకొని మందులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇలా పలు గ్రామాల్లో నకిలీ వైద్యం పేరిట నమ్మించి దాదాపు రూ.6 లక్షల వరకు వసూలు చేశాడు. గంభీరావుపేటలో తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50మందిని మోసం చేశానని అజయ్ ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా కృషి చేసి ఎస్‌ఐ శ్రీకాంత్, ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



అజయ్

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి

ఇల్లంతకుంట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన శీలం రజనీకాంత్(26) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రజనీకాంత్ తంగళ్లపల్లి మండలం జిల్లెల క్రాసింగ్‌కు వెళ్లి గురువారం రాత్రి ఇంటికి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో వాహనంతో సహాపడి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బావిలో నుంచి తీయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

మంథనిరూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మామిడి రామకృష్ణ, పిట్టల శ్రీనివాస్, మేకల రమేష్‌లు టీఎస్ 25 టీ 6542, టీఎస్ 25 టీ 6622 అనే రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా టిప్పర్లలో ఇసుక నింపిన ఎక్స్‌కవేటర్ డ్రైవర్, ఓనర్ ఐలి కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

బైకు, రెండు ఆటోలను ఢీకొట్టిన కారు

● కారులో బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన పెను ప్రమాదం
● ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బైకు.. రెండు ఆటోలను ఢీకొట్టి ఓ కారు బోల్తా పడ్డ ఘటనలో ఒకరు తీవ్రంగా, పలువురు స్వల్పంగా గాయపడ్డారు. గురువారం శంకరపట్నం మండలం వంకాయగూడెం శివారులో ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్స్‌లతో కలిసి కారులో కరీంనగర్‌లోని ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్, వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయగూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోతో పాటు టాటా ఎస్ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోడ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. బైకుపై ప్రయాణిస్తున్న మానకొండూర్ మండలం శంషాబాద్‌కు చెందిన డొల్ల సతీష్, టాటా ఏసీ డ్రైవర్ తాడికల్‌కు చెందిన పెరిక రాజమల్లుకు స్వల్ప గాయాలయ్యాయి. పెరిక రాజమల్లును 108 వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను నమోదు చేసుకొని ప్రమాదంపై విచారణ చేపట్టారు.



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాదంలో ధ్వంసమైన టాటా ఏస్ ఆటో

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ



దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) దొంగతనాలకు పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ జి కృష్ణ చోరీ తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మల్హార్‌రావు మండల్ రెడ్డిపల్లికి చెందిన బొరిగం సంపత్ తన తల్లి చనిపోగానే తండ్రి మరో వివాహం చేసుకున్నాడు. ఇంట్లో పరిస్థితులు అనుకూలించక చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో 2005లో దొంగతనానికి పాల్పడి అదే వృత్తిగా ఎంచుకున్నాడు. గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్, వరంగల్, హన్మకొండ, మంథని, కొయ్యూరు, హసన్‌పర్తి తదితర ఏరియాల్లో దొంగతనాలకు పాల్పడి 36 కేసుల్లో జైలు జీవితం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మళ్లీ అదే వృత్తిని కొనసాగించాడు. ఇదే క్రమంలో ఈ నెల 2న కాల్వశ్రీరాంపూర్ మండలం చిన్నరాతుపల్లికి చెందిన మద్దెల శాంతమ్మ ఇంట్లో ఎవరు లేని సమయంలో చొరబడి బీరువా తాళం పగుల గొట్టి నగదు బంగారం దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తారుపల్లి వద్ద గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన సంపత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడి నుంచి 2 లక్షల 25 వేల నగదు, 149 గ్రాముల బంగారం సుమారు(13 లక్షలు) ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి, వెంకటేష్, సిబ్బంది అశోక్, లక్ష్మన్, వినుస్తర్, రవీందర్, ప్రభాకర్, రమేష్, రాజు, రాజ్‌కుమార్, లను ఏసీపీ అభినందించారు. దొంగను కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

సుల్తానాబాద్‌లో ఇద్దరు

● సుల్తానాబాద్: ఇళ్ల తాళాలు పగులకొట్టి రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. సుల్తానాబాద్ మార్కండేయ కాలనీకి చెందిన వేముల చంద్రప్రకాష్, సుల్తానాబాద్ గాంధీనగర్‌కు చెందిన బైరి కిరణ్ ఇద్దరు కలసి అనేక దొంగతనాలకు పాల్పడ్డారు. వేముల చంద్రప్రకాష్ గంజాయి కేసుల్లో కూడా పలు సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. గత జనవరి 17న గాంధీనగర్‌లోని వంగల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంట్లో ఇద్దరు నిందితులు తాళాలు పగులకొట్టి టీవీ దొంగిలించారు. టీవీని అమ్మగా వచ్చిన 20వేల రూపాయలను ఇద్దరు పంచుకున్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తుండగా శాస్త్రినగర్ వద్ద పట్టుబడగా వారిని అదుపులోకి తీసుకుని ఇరవై వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వేముల చంద్రప్రకాష్‌పై సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు కేసులు, పెద్దపల్లిలో ఒకటి, నిజామాబాద్‌లో ఒక కేసు, కరీంనగర్‌లో ఓ కేసు ఉందని ఎస్‌ఐ సీహెచ్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చొప్పదండిలో ఇద్దరు

● చొప్పదండి: చొప్పదండిలో కాపర్‌వైర్ దొంగతనం చేసిన ఇద్దరు దొంగలను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు. చొప్పదండిలోని శ్రీరామ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రానిక్స్ గోదాంలో ఉన్న కాపర్‌వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని మంగళవారం ఫిర్యాదు చేయగా, గురువారం చొప్పదండి బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక పెద్ద సంచితో అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. ఇద్దరిని పట్టుకొని తనిఖీ చేయగా కాపర్ వైర్లు కనిపించాయని, విచారించగా దొంగిలించిన సొత్తుగా గుర్తించి గోగులకొండ మహేష్, కడారి అభిషేక్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గోగులకొండ మహేష్, రామ్‌టెక్ శివప్రసాద్, కడారి అభిషేక్‌లు స్నేహితులుగా ఉంటూ ఈజీ మనీ కోసం దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ రుద్రవ రం రాజు(47) గురువారం మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు న్నాయని మృతుడి తల్లి రుద్రవరం సుగుణ కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాజు కడుపులో ఇన్‌ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురయ్యాడని, అతడి భార్య పట్టించుకోలేదని, బుధవారం తమ కొడుకును చూసేందుకు వెళ్లగా బయటకు గెంటేశారని, గురువారం ఉదయం రాజు మృతి చెందినట్లు సమా చారం అందించారని పేర్కొంది. కానిస్టేబుల్ రాజు మృతికి అతని భార్య, ఆమె తల్లిదండ్రులు, ఒక కానిస్టేబుల్ మరి కొందరిపై అనుమానాలున్నాయని తెలిపింది. దీనితో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

పెళ్లి ఊరేగింపులో అపశ్రుతి

● నృత్యం చేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు

శంకరపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్‌పల్లిలో ఓ పెళ్లి ఊరేగింపులో గురువారం అపశ్రుతి చోటు చేసుకున్నది. పెళ్లి ఊరేగింపు జరుగుతుండగా ఓ కారు నృత్యం చేస్తున్నవారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నరేందర్‌రెడ్డి విమర్శనాస్త్రాలు ఎవరిపై?



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

- లోటుపాట్లపై నివేదిక ఇస్తానని ప్రకటన
- మూడు నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గాయని ఆవేదన
- జిల్లాలో నాయకత్వ లోపముందని వ్యాఖ్య

కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో పోరాడి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి తన ఓటమికి గల కారణాలు, ఎన్నికల సందర్భం లో జరిగిన లోటుపాట్లపై పార్టీ నాయకత్వానికి నివేదిక ఇస్తానని ప్రకటిం చారు. కాంగ్రెస్‌కు జిల్లాలో నాయకత్వ లోపం ఉందని, దీనిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానని వ్యాఖ్యానించడం పార్టీలో కలకలం సృష్టిస్తున్నది. చొప్పదండి, వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్లు తక్కు వ వచ్చాయని, కరీంనగర్‌లో నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయంగా ఎవరిపై బాణం ఎక్కుపెట్టారని చర్చించుకుంటు న్నారు. ఎన్నికల సందర్భంగా పార్టీ కార్యకర్తలు తన వద్దకు రావడానికి కొంత మంది అనుమతి తీసుకోవలసిన పరిస్థితి ఎదుర్కొన్నారని, పార్టీలో గ్రూపు రాజకీయాలు ఉన్న నేపథ్యంలో సమన్వయం పరిచే నాయకత్వం లోపించిందని నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ ప్రక్షాళనకు తనవంతు కృషిచేస్తానని పేర్కొన డంతో ఆయన ఎవరిపై ఫిర్యాదు చేయనున్నారు అన్నది చర్చనీ యాంశంగా మారింది.

అన్ని వేళ్లూ అటు వైపే..

నరేందర్‌రెడ్డి ఓట్లు తక్కువ వచ్చాయని పేర్కొన్న మూడు నియోజక వర్గాల్లో సిరిసిల్ల మినహా మిగతా రెండింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈ మూడు నియోజకవర్గాలు కరీంనగర్ పార్లమెం ట్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గంలో మంత్రి పొన్నం ప్రభాకరే ఇప్పటికీ పూర్తి స్థాయిలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యత వహిస్తున్నారు. నరేందర్‌రెడ్డి అసంతృప్తి ఆయా నియో జకవర్గ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పైనేనా అన్న చర్చ సాగుతోంది. కరీంన గర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న పురమల్ల శ్రీనివాస్ ఇదివరకే తనకు ఏ స్వేచ్ఛ లేకుండా పోయిందని, నియోజక వర్గ ఇన్‌చార్జిగా తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయిన వెలిచాల రాజేందర్‌రావు నిజానికి పార్లమెంట్ ఇన్‌చా ర్జిగా వ్యవహరించాలి. ఆయన పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతల్లో ఉన్నారో లేదో ఆయనకే తెలియని పరిస్థితి జిల్లాలో నెలకొన్నది.

కరీంనగర్ జిల్లా మొత్తం సుడా పరిధిలోకి వచ్చినా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి పలు సమావేశాలకు ఆహ్వానమే అందడం లేదు. ఈ ముగ్గురు నేతలు కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఉంటూ తమకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పరోక్షంగా పలుమార్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

ఇప్పుడు నరేందర్‌రెడ్డి కూడా వారి సరసనే చేరా రా... ఆయన పేరు పేర్కొనకపోయినా జిల్లాలో సమన్వయ పరిచే నాయకత్వం లేదనడం మంత్రి ఆ పని చేయడం లేదని పరోక్షంగా చెప్పడ మేనా... అని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఒకటికి రెండు సార్లు మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతూ తన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచారని ప్రకటించడం కూడా ఈ చర్చకు దారితీసినట్టు యింది. ఎన్నికల అనంతరం నరేందర్‌రెడ్డి రాజకీయాల్లో ఉండరు.. ఆయన స్కూల్స్ నడుపుకుంటారని వ్యాఖ్యానించినవారికి జవాబుగా పట్టభద్రుల ఎన్నికల్లో ఓటమి తనకు మరింత బాధ్యతలను పెంచిందని, కాంగ్రెస్ వాదిగా పార్టీలో మరింత చురుకుగా పనిచేస్తూ ఏ బాధ్యత అప్పగించినా నిర్వహిస్తానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంటానని ప్రకటించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తన ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని 42 నియోజకవర్గాలలో తాను గమనించిన సమస్య లను, పట్ట భద్రులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పడం రేపటి నుంచే తన కార్యాచరణ ప్రారంభమవు తుందని ప్రకటించడం పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలని అన్న నిర్ణయానికి నరేందర్‌రెడ్డి వచ్చారని ఆ పార్టీ నాయకులు అనుకుంటు న్నారు. నరేందర్‌రెడ్డి పార్టీలో లోటుపాట్ల పేరిట ఏ అంశాలు ప్రస్తావి స్తారు.. ఏ నాయకులపై ఫిర్యాదులు చేస్తారు... అన్నదే పార్టీలో సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న అంశంగా మారింది.

కాంగ్రెస్‌వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతా

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి తన బాధ్యతను మరింత పెంచిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ వాదిగా ప్రత్యక్ష రాజకీయాల్లో కొనసాగుతానని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేం దర్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా తనపై చేసిన విషప్రచారాన్ని పట్టభద్రులు పట్టించు కోలేదని, తనకు అండగా నిలిచి ఓట్లు వేశారని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకోసం కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ శ్రేణులకు, అల్ఫోర్స్ కుటుంబ సభ్యులకు సీపీఐ, సీపీఎం, టీజేఎస్, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాలకు కృతజ్ఞతలు తెలి పారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తనకు అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామో దర రాజన ర్సింహ, పొన్నం ప్రభాకర్‌తోపాటు నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిలు, డీసీసీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ప్రచారం, పోలింగ్‌బూత్‌ల మేనేజ్‌మెంట్ వరకు మంత్రే చూసు కున్నారని, తన గెలుపునకు తీవ్రంగా కృషి చేశారని అన్నారు. ఎన్నిక లకు ముందు నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పట్టభద్రులకు ఇచ్చి న హామీల అమలుకు తన కార్యాచరణ ఉంటుందని, అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు.. కాం గ్రెస్‌లో లోటుపాట్లపై పార్టీ పెద్దలకు నివేదిక ఇస్తానని, పార్టీలో స్తబ్దత నెలకొందని పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వేతనాలు అందక ఇబ్బందులు



రెండు నెలలుగా ఉపాధిహామీ సిబ్బంది ఎదురుచూపులు

పెద్దపల్లి రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఉపాధినిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఈజీ ఎస్ ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వేసవిలో ఉపాధిహామీ పథకాన్ని గ్రామాల్లో ఉద్యోగు లు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వర్తించే కార్యాలయ ఉద్యోగుల కు నెల రోజుల వేతనం రాకపోగా, గ్రామాల్లో విధు లు నిర్వర్తించే ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనా లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సమ యానికి వేతనాలు లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లే కీలకం

ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కీలకపాత్ర పోషి స్తున్నారు. ఈజీఎస్ ద్వారా రైతువేదికల నిర్మాణాలు, రైతుకల్లాలు, పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లు, ఇంకుడు గుంతలు, మరు గుదొడ్ల నిర్మాణం, అవెన్యూ ప్లాంటేషన్, పశువుల షెడ్లు, మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, మొక్కల రక్షణ, కాలువ లు శుభ్రంతో పాటు పలు రకాల పనులను గ్రామా ల్లో చేపడుతున్నారు.

ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సజావుగా నిర్వహిం చేందుకు కీలకపాత్ర పోషిస్తూ పనిభారంగా మారు తున్న అవేమీ పట్టనట్లుగా ఓపికతో నిర్వర్తిస్తున్నారు. పెద్దపల్లి మండలంలోని 30 గ్రామాలకు 30 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు 22 మంది మాత్రమే ఉన్నారు. వీరితో పాటు ఏపీవో, జేఈ ఒకరు, టెక్నికల్ అసి స్టెంట్‌లు ముగ్గురు, ఒకరు కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహిస్తున్నారు.

ఉదయం నుంచే ఉపాధి పనుల్లో ఉద్యోగులు

తెల్లవారుజాము నుంచే ఫీల్డ్ అసిస్టెంట్‌లు జాబ్ కార్డు దారుల వారికి ఉపాధి పనులు కల్పిస్తున్నారు. గ్రామాల వారిగా ఉపాధి కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఇచ్చిన కొలతల ఆధారంగా కూలీలు పనులు ముగిం చుకొని వెళ్లే వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు పర్య వేక్షిస్తునే ఉంటారు. వీరితో పాటు టెక్నికల్ అసిస్టెంట్ లు, ఉన్నతాధికారులు సైతం ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్నారు. కూలీలకు పనులతోపాటు హరిత హారంలో నాటిన మొక్కలను రక్షించేందుకు నీరు అం దించడం, నర్సరీల్లో మొక్కల పెంపుదల, పశువుల షెడ్లు అవసరం ఉన్నవారికి అమలు పనుల్లో ఉద్యో గులు నిమగ్నమవుతారు. అధికారులు ఇచ్చిన లక్ష్యాల కు అనుగుణంగా ఉపాధి కూలీలను తీసుకొచ్చే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసుకుంటున్నా ప్రభు త్వాలు పట్టించుకోని పరిస్థితి ఉంది.



పొద్దంతా కష్టపడుతున్నాం..: సుమలత, కొత్తపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్

గ్రామాల్లో ఉదయం నుంచి చేపడుతున్న పనులను కిందిస్థాయి కూలీలతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తిస్తున్నాం. కనీసం ప్రభుత్వం మమ్మల్ని గుర్తించని పరిస్థితి ఉంది. ఓ వైపు లక్ష్యాలు ఇస్తే వాటికి అనుగుణంగా పనులు పూర్తి చేస్తున్నాం. పొద్దంతా కష్టపడుతున్న సమయానికి వేతనాలు రాకపోవడంతో ఇంట్లో పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. ప్రభుత్వాలు చొరవ తీసుకొని ప్రతీ నెల మొదటి వారంలోనే వేతనాలు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలి.

ప్రతి నెల వేతనాలు అందించాలి

రమేష్‌బాబు, ఏపీవో, పెద్దపల్లి



పనులకు అనుగుణంగా సమయా నికి ప్రతీ నెల వేతనాలు అందించాలి. నిత్యం ఫీల్డ్ ఉంటున్న ఈజీఎస్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను సమయానికి అందిస్తే ఆర్థిక ఇబ్బం దులకు గురికాకుండా ఉంటాం.

ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- ఈ నెల 10 నుంచి ప్రారంభం

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మార్చి 10 నుంచి 22 వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల ప్రకారం ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు గోపురాలకు, దేవాలయం లోపల రంగులు వేయించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి అందంగా అలంకరణ చేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయం లోపల, బయట ప్రత్యేక క్యూలైన్లు, కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తి తీర్చడం కోసం ఆలయం లోపల, బయట దాతల సహకారంతో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్యవైశ్య, వర్తకులు, రైస్‌మిల్ యజమానులు, దాత లు, స్వచ్ఛంద సంస్థలు కలిసి భక్తుల సౌక ర్యార్థం బ్రాహ్మణ సంఘం, టీటీడీ ఆవర ణలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తు న్నారు. ఆలయం లోపల, బయట సోడి యం హైపోక్లోరైడ్ స్ప్రే చేయిస్తున్నారు. భక్తుల కోసం 25 క్వింటాళ్ల పులిహోర ప్రసాదం, ఒక లక్ష లడ్డు ప్రసాదాలు తయారు చేయిస్తున్నారు. 60 సీసీ కెమెరా లు దేవాలయాల పరిసరాల్లో, గోదావరి నదీ తీరంలో, పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఏర్పాట్లను పర్య వేక్షిస్తున్నారు. సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తదితరులు ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగనీయకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాజన్న ఖజానాకు రూ.2.31 కోట్ల నగదు

- బంగారం 201 గ్రాములు, వెండి 16.20 కిలోలు



హుండీ లెక్కింపు చేస్తున్న సిబ్బంది, భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఖజానాకు రూ.2 కోట్ల 31 లక్షల 65 వేల 333 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య గురువారం హుండీలను లెక్కించారు. 201 గ్రాముల బంగారం, 16 కిలోల 200 గ్రాముల వెండి, సమకూరినట్లు తెలిపారు. రాజన్న ఆలయంలో 14 రోజుల హుండీలను లెక్కించామని, మహా శివరాత్రి జాతర సందర్భంగా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

కొండగట్టులో 10నుంచి పవిత్రోత్సవాలు



మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ దేవస్థానంలో ఈ నెల 10 నుంచి పవిత్రోత్సవాలు నిర్వహి స్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. ప్రతియేటా లోక కల్యాణార్థమై త్రయా హ్నిక దీక్షచే మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవా యితీగా వస్తోంది. పవిత్రోత్సవాల్లో భాగం గా నిత్యం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పారాయణం, నిర్వహించనున్నారు.

స్కానింగ్ కేంద్రాల తనిఖీలు

సిరిసిల్ల టౌన్, మార్చు 6 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని స్కానింగ్ కేంద్రాలను గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్, మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ సూర్యశ్రీరావు ఆకస్మిక తనిఖీలు చేశారు. స్కానింగ్ కేంద్రాలలోని రికార్డులను పరిశీలించి ఫారం ఎఫ్‌లు సరిగా నిర్వర్తించవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యశ్రీరావు మాట్లాడుతూ రేడియా లజిస్ట్, గైనకాలజిస్ట్ డాక్టర్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని అన్నారు. లింగనిర్ధారణ నిషేధిత చట్ట స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈ తనిఖీలను సిరిసిల్ల పట్టణంలో నిర్వహిస్తున్నామన్నారు.

ఈ తనిఖీల్లో జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల గైనకాలిజిస్ట్ డాక్టర్ సుచిత్రలక్ష్మి, జిల్లా పీవోఎంహెచ్ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, డిప్యూటీ డెమో రాజ్‌కు మార్, హెచ్ఈ బాలయ్య, సఖీ కన్సల్టెంట్ రోజా, కానిస్టేబుల్ శ్రీలత, డాటా ఎంట్రీ ఆపరేటర్ మహేష్ పాల్గొన్నారు.



స్కానింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డాక్టర్ సూర్యశ్రీరావు

యోగా శిక్షకురాలికి జాతీయ అవార్డులు



అన్నపూర్ణ

కోల్‌సిటీటౌన్, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): గోదావ రిఖనికి చెందిన యోగా శిక్షకు రాలు కొంకన అన్నపూర్ణ రెండు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన శాంతి ఫౌండేషన్ సంస్థ సావిత్రిబాయి పూలే పేరిట వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు ఇంటర్నేషనల్ ప్రైడ్ ఉమెన్ అవార్డులను అందజేస్తుంది. ఈ అవార్డుకు అన్నపూర్ణను ఫౌండేషన్ ఎంపిక చేసింది. హన్మకొండకు చెందిన వినిశెట్టి జగదీశ్వరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఇన్‌స్పిరేషనల్ ఉమెన్ అవార్డుకు అన్నపూర్ణను ఎంపిక చేసింది.

అడుగంటిన పెద్ద చెరువు



- చుట్టూ కాలువలున్నా ప్రయోజనం శూన్యం
- తూము ఏర్పాటు చేయాలని రైతుల విజ్ఞప్తి

మల్యాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో పెద్ద చెరువుకు రెం డు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో నీరు లేక వెలవెలబోతోంది. తూము నిర్మిస్తే వేసవిలో పంటలకు సాగు నీరు అందే అవకాశం ఉం ది. చెరువుకు రెండు పక్కల కాకతీయ కెనాల్ ఉప కాలువలు ఉన్నా వేసవిలో పంటలకు పూర్తి స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. పెద్ద చెరువు కింద వం దలాది ఎకరాల భూముల్లో రైతులు సాగు చేస్తుంటా రు. ఈ చెరువుకు సమీపంలో నుంచి రెండు పక్కల డీ65, డీ67 ఉప కాలువలు నిండుగా ప్రవహిస్తున్నా యి. ఈ చెరువుపై మనాల శివారులోని దమ్మక్క చె రువు కాకతీయ కాలువ పక్కన ఉండగా అక్కడి నుం చి ప్రస్తుతం నీరు వచ్చే అవకాశం లేదు. దీంతో డీ65 నుంచి తూము ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. తూము ఏర్పాటు చేస్తే వందలాది ఎకరాలకు సాగు నీరు అందడంతో పాటు గ్రామంలోనూ భూగర్భ జలా లు వృద్ధి చెందుతాయని రైతులు పేర్కొంటున్నారు.

తూము నిర్మించాలి

ముదుగంటి రాజు, మ్యాడంపల్లి

డీ65 ఉప కాలువ నుంచి తూము ఏర్పాటు చేస్తే పెద్ద చెరువు నింపుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తు తం కాలువ వద్ద పైపులు అమర్చి ఉన్నప్పటికీ వాటి నుంచి నీటి మళ్లింపు అంతంత మాత్రమే. దీంతో చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేక పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో తూము ఏర్పాటు చేయాలని అధికారులను కోరాం. మళ్లీ కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తాం.





మ్యాడంపల్లిలో నీరందక ఎండుతున్న వరి, తూము ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం, ఉప కాలువ నుంచి ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్

ఎస్సారార్‌లో ముగిసిన జాతీయ సదస్సు



మట్లాడుతున్న డాక్టర్ వెల్దండ నిత్యానందరావు

గణేశ్‌నగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో 'ప్రాచీన తెలంగాణ వాంగ్మ యం ఒక అవలోకనం' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. కళాశాల, కరీంన గర్ తెలుగు భాగం, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన వాంగ్మయ పరిశోధనే జీవధాతు అని అన్నారు. ఇక్కడ జాతీయ సదస్సు నిర్వహిం చడం గొప్పవిషయమన్నారు. ఎందరో సాహితీ ఉద్దండులు నడయాడిన నేలలో కందపద్యంతో తెలుగు భాషకు ప్రాచీన హోదా లభించడం ఆనందంగా ఉందన్నారు. పద్నాలుగు భాషలు వచ్చిన పండితులు ఇదే నేలలో జన్మించడం, శేషప్ప సిద్ధప్ప వంటి పద్య కవులు విలసిల్లిన కరీంనగర్ భూమి చాలా గొప్పదన్నారు. మనుషులు యాంత్రిక మైపోయిన సమయంలో సదస్సు ద్వారా గొప్ప రచయితలు వక్తలు ఒకచోట చేరడం అభినందనీయమన్నారు. డాక్టర్ వెల్దండ నిత్యానందరావు, డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, నెల్లూరు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సాగి కమలాకర్ శర్మ, బెనారస్ హిందూ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కళాశాల తెలుగు విభాగ అధిపతి డాక్టర్ భూర్ల చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజయ్య పాల్గొన్నారు.

అధ్యాపకులకు గైడ్‌షిప్ అవకాశం కల్పించాలి



వీసీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యాపకులు

గణేశ్‌నగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేసే అర్హులైన అధ్యాపకులం దరికీ గైడ్‌షిప్ అవకాశం కల్పించాలని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్‌రెడ్డి కోరారు. బుధ వారం ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ అర్హులైన అధ్యాపకులను పీహెచ్‌డీ పర్యవేక్షకులుగా గుర్తించాలని, పరిశోధన అవకాశాలు పెంపొందించాలని అన్నారు. యూజీసీ కళాశాల విద్యాశాఖ నిబంధనలను అనుసరించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను క్లస్టర్లుగా గుర్తిం చాలన్నారు. కొన్ని కళాశాలల్లో అర్హులైన అధ్యాపకులు ఉన్నా సంబంధిత కోర్సులు అందుబాటులో లేకపోవడంతో పరిశో ధనలకు ప్రతిబంధకంగా మారిందన్నారు. కళాశాలలను క్లస్టర్‌లుగా చేసి అన్ని విభాగాలను ఒకే యూనిట్ పరిధిలోకి తీసుకొస్తే అడ్డంకులు తొలిగిపోతాయన్నారు. టీజీసీజీటీఏ ఎస్‌యూ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మల్లారెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్, సంఘం బాధ్యులు డాక్టర్ టి.శ్రీనివాస్, ఎస్.రమేష్ బాబు ఉన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

బీర్‌పూర్,మార్చి 6(ఆంధ్రజ్యోతి):బీర్‌పూర్ మండలంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 92 మంది ఉండగా అందులో 91 మంది పరీక్షకు హాజరయ్యారు. అందులో ఒక్కరు గైర్హాజ రయ్యారు. పరిక్ష కేంద్రాన్ని సిట్టింగ్ స్క్వాడ్, తహసీల్దార్ ముంతాజుబ్దిన్‌లు తనిఖీలు చేశారు. ఈ పరిక్షల నిర్వహనకు ఒక్కరు డీవో, ఒక్కరు సీఎస్, ఒక్కరు ఈబీ, నలు గురు ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు

వెల్గటూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటి లింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ. 1,72,976లు ఆదాయం లభ్యమైనట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి కాంతారెడ్డి తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని కానుకలు హుండీలలో వేయగా వాటిని లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డివిజన్ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ రాజయ్య, నాయకులు పూదరి రమేష్, గుమ్ముల వెంకటేష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

వంశపారంపర్య ధర్మకర్తను నియమించొద్దు

కొడిమ్యాల, మార్చి6(ఆంధ్రజ్యోతి): నల్లగొండ ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్తను నియమించవద్దని గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందించినట్లు పూడూర్ సింగిల్‌విండో వైస్ చైర్మన్ సావనపెల్లి రమేష్ విలేకరులకు తెలిపాడు. నల్ల గొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవ స్థానం వంశపారంపర్య ధర్మకర్త చెన్నాడి సత్యనారాయణరావు గత నెల 29న మరణించినందున అతడి కుమారుడు చెన్నాడి రమాకాంతరావుకు ధర్మకర్త ఎఫ్‌టీ ఉత్తర్వులు ఇవ్వవద్దని కమిషనర్‌ను కోరారు. వైస్ చైర్మన్ మాట్లాడుతూ దేవా దాయ ధర్మాదాయ చట్టం ప్రకారం స్వంత డబ్బులతో ఆలయ నిర్మాణం చేసిన వారికి ధర్మకర్త ఇవ్వాలన్నారు. భక్తుల డబ్బులతో ఆలయ నిర్మాణం చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తి స్థాయి విచారణ చేసి దేవాలయానికి న్యాయం చేయాలని రమేష్ కోరారు.

విజయవంతం చేయాలి

మెట్‌పల్లిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) :వామనశ్రమ స్వామిజీ 21వ పట్టాభి షేకంను విజయవంతం చేయాలని వైశ్య గురు సేవా సమితి తెలంగాణ అధ్య క్షులు షైలారపు లింబాద్రి కోరారు. గురువారం అదిలాబాద్‌లో పట్టాభిషేక కరపత్రాలను వాసవి దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 20న అదిలాబాద్‌లో పట్టణంలో 21వ పట్టాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి



జగిత్యాలలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు



కోరుట్లలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని బీజేపీ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలో చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీ మూసివేతకు కుట్రలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆరోపించారు. నవోదయ పాఠశాల ఏర్పాటుకు షుగర్ ఫ్యాక్టరీ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జగిత్యాల నియోజకవర్గ శాఖ తరుపున జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌరస్తావద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావకాశాలు మెరుగు పర్చేందుకు నవోదయ పాఠశాలను నిజామాబాద్‌కు కేటాయిస్తే షుగర్ ఫ్యాక్టరీ భూమిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపడం ఏంటని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విద్యా, ఇతర మౌలిక వసతుల కోసం చొరవ చూపితే రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ రాష్ట్ర పురోగాభివృద్దిని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరం అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే నవోదయ పాఠశాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడుతూ నవోదయ పాఠశాల ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేసిన సుదర్శన్ రెడ్డిని తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించడంతో పాటు, నవోదయ పాఠశాల ఏర్పాటుకు 30ఎకరాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముఖ్యమంత్రి తక్షణమే గద్దెదిగిపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి, పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, జిల్లా ఆఫీస్ బేరర్ జుంబర్తి దివాకర్, మహిళామోర్చ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబారి కళావతి, పట్టణ అధ్యక్షురాలు దురిశెట్టి మమత, వివిధ హోదాల బాధ్యులు పవన్‌సింగ్, వెంకటేష్, చంద్రశేఖర్, పిల్లి శ్రీనివాస్, సదాశివం తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

కోరుట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి కోరుట్ల నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నవోదయ పాఠశాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని గురువారం బీజేపీ, బీజేవైఎం శ్రేణులు పట్టణంలో మహాధర్నా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహంకు నివాళులు అర్పించి జాతీయ రహదారి మీదుగా కల్లూర్ రోడ్డు వరకు ర్యాలీని నిర్వహించారు. జాతీయ రహదారి కల్లూర్ ఎక్స్ రోడ్డులో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు చీటినేని రఘు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వడ్డెపల్లి శ్రీనివాస్, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి నరేందర్‌రెడ్డిలు మాట్లాడారు. మూతపడిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి వాటి భూములు అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నవోదయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామ చంద్రుడు ఆందోళనకారులవద్దకు చేరుకొని ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు పెండం గణేష్, మ్యాడవేని నరేష్ బీజేపీ నాయకులు సుదవేణి మహేష్, తిరుమల వాసు, కస్తూరి లక్ష్మినారాయణ, తులసి కృష్ణ, దోనికెల నవీన్, ఆర్ శ్రీనివాస్ రావు, ఉరుమడ్ల చరణ్, ఎలాల నారాయణ రెడ్డి, ఎర్ర రాజేందర్, ముక్కల అంజనేయులు, వల్లజీ నరేష్, కంఠం ఉదయ్, నేమూరి విజయ్, సడిగే మహేష్, కలాల సాయిచంద్, దామ్మ సంతోష్, త్రైదాల ప్రశాంత్, సాయి, జక్కుల ప్రవీణ్, గుండెటీ సంజీవ్, ప్రకాష్ పాల్గొన్నారు.

'పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి'



నినాదాలు చేస్తున్న రైతు ఐక్యవేదిక నాయకులు

మల్లాపూర్, మార్చి, 6 (ఆంధ్రజ్యోతి): పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు పసుపుకు కనీసం రూ.15వేలు మద్దతు ధర కల్పిస్తూ బోనస్ అందజేయాలన్నారు. గురువారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు కొత్తధాంరాజుపల్లి గ్రామాల్లో రైతు ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. ఈనెల 11న చేపట్టబోయే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం పసుపుకు మద్దతు ధర క్వింటాలకు రూ. 16వేల నుంచి 18వేలకు పలికిందన్నారు. కానీ ప్రస్తుతం రూ. 8వేల నుంచి 11వేల వరకు ధర పలుకుతుందన్నారు. దీంతో పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నరని, పసుపు మద్దతు ధర కల్పించి, బోనస్ అందజేయడంతో పాటు సమస్యల పరిష్కరం కోసం మహాధర్నా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు డబ్బా రమేష్‌రెడ్డి, నాయకులు కాటిపల్లి గంగారెడ్డి, తురుక శ్రీధర్‌రెడ్డి, బందేలా మల్లయ్య, కొమ్ముల సంతోష్, కాటిపల్లి ఆదిరెడ్డి, మామిడి రాజశేఖర్‌రెడ్డి, పుండ్ర శ్రీనివాస్, కళ్ళెం మహిపాల్, సుధాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, ఎన్టీఆర్, బద్దం కమలాకర్, లింబారెడ్డి, భూమారెడ్డి, సత్యనారాయణ, గంగరాజం, శ్రీనివాస్‌రెడ్డి, లచ్చయ్య, గంగారెడ్డి, వినోద్‌రెడ్డి, హరీష్, రాజేందర్, రైతు సంఘాల నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కథలాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తక్కళ్ళపల్లిలో ఈ నెల 8 నుంచి 15 వరకు శ్రీ అండాల్ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8న పుణ్యాహవచనం, అంకురారోహణం, గోదూళి సుము మూర్తమున కల్యాణోత్సవం, 9న హోమం, అష్టబలి, తీర్థప్రసాద వితరణ, సూర్యప్రభ వాహన సేవ, 10న అర్చన, హోమం నివేదన చంద్రప్రభ వాహన సేవ, 11న బలిప్రదానం, నిత్యహోమం, హన్మాన్ వాహన సేవ ఉంటాయన్నారు. 12న సత్యనారాయణ వ్రతం, గజవాహన సేవలో స్వామివారి గ్రామ పర్యటన, 13న నిత్య హోమం గరుడ వాహన సేవ, మహా అన్నప్రసాదం, డోలోత్సవం, వసంతోత్సవం, బంతులాట, 14న స్వామివారి రథోత్సవం, ఊరేగింపు, అభిషేకం, పూర్ణాహుతి, చక్ర తీర్థం 15న నాగవెళ్ళి, దేవతోద్వాసన, సప్తావర్ణాలు, రుత్విక్ సన్మానం, ఏకాంత సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

● కలెక్టర్ సత్యప్రసాద్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లిటౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) :పట్టణంలో వంద శాతం ఇంటి పన్నును వసూలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యయలంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్‌కు ఎంత మంది దరఖాస్తు చేశారు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో వంద శాతం ఇంటి పన్నును త్వకగా వసూలు చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కొడిమ్యాల, మార్చి6 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ళ పైలెట్ గ్రామంగా ఎంపిక చేయబడిన మండలంలోని రాంసాగర్ గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిని అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం ప్రారంభించని లబ్దిదారులతో మాట్లాడుతూ వెంటనె ఇళ్ళ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో ఇ. స్వరూప, తహసీల్దార్ జి. రమేష్, ఎంపీవో ప్రవీణ్, ఆర్ఐ కరుణాకర్, కార్యదర్శి విద్యాసాగర్, లబ్దిదారులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

బీర్‌పూర్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను వెంటనే పూర్తిచేయాలని జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి గౌతమ్ రెడ్డి అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ లచ్చాలు, మాజీ సర్పంచ్ చిక్రం సుగుణ మారుతి, కార్యదర్శి లివిన్ తదితరులు ఉన్నారు.

క్షయరహిత గ్రామాలుగా మానాల, గొర్రెగుండం

మల్యాల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): క్షయరహిత గ్రామాలుగా మండలంలోని మానాల, గొర్రెగుండం ఎంపిక అయ్యాయి. ఈ గ్రామాల్లో వంద శాతం క్షయ పరీక్షల అనంతరం క్షయ కేసులు లేకపోవడంతో క్షయరహిత గ్రామాలుగా పేర్కొనడం జరిగిందని డిప్యూటి డీఎంహెచ్‌వో ఎన్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయా గ్రామాల్లో పర్యటించి క్షయ పరీక్షలు, కేసుల వివరాలు ఇతరాత్ర పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. క్షయ నిర్మూలనలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో క్షయ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. వైద్యురాలు మౌనిక వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహిళా ఉద్యోగులకు టీఎన్జీవో అండ

జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులందరికి టీఎన్జీవో సంఘం అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టిఎన్జీఓ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగినులందరిని ఘనంగా సన్మానించారు. అనంతరం నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత, వారి హక్కులు, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తు మహిళలు అన్ని రంగాలలో ముందుకెళ్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిఎన్జీఓ జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, సాహెబ్ బాబు, చంద్రిక, మమత, అర్షియా, శావణి, విజయలక్ష్మి, పద్మావతి, కళ్యాణి, కవిత, సువర్ణ, ఆమని, శైని ఉన్నారు.

కలప పట్టివేత

కొడిమ్యాల, మార్చి6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని దమ్మయ్యపేట, రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామాల శివారులోని అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన 89వేల రూపాయల విలువైన టేకు కలప 52 దుంగలను బుధవారం అర్ధరాత్రి అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ముషీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. కొడిమ్యాల అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ తెలిపిన వివరాల మేరకు కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పక్కగా అందిన సమాచారం మేరకు అటవీ సిబ్బందితో మండలంలోని దమ్మయ్యపేట గ్రామ శివారును ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో 52 టేకు దుంగలు కనిపించాయన్నారు. పట్టుకున్న కలపను కొడిమ్యాల రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. అనంతరం కల్లెడలో ఉన్న అటవీ శాఖ కర్ర డిపో కార్యాలయానికి తరలించినట్లు డీఆర్వో తెలిపారు. ఆయన వెంట బీట్ అధికారులు ఆనందరావు, అశ్విని, బేస్ క్యాంప్ సభ్యుడు దేవేందర్ ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

-డీఆర్‌డీవో రఘువరన్



ఉపాధిహామీ పనుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

పెగడపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పని కోసం ధరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పథకంలో పని కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ పేర్కొన్నారు.పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని, నర్సరీని గురువారం డీఆర్‌డీవో రఘువరన్ సందర్శించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కూలీల మస్టర్ రిజిష్టర్‌ను పరిశీలించి, పని కోరిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని సూచించారు.

నర్సరీని పరిశీలించి హరిత లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలన్నారు. వంద శాతం మొక్కలను బతికించాలని అన్నారు. డీఆర్‌డీవో తో పాటు పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో అనీల్, టెక్నికల్ అసిస్టెంట్ నాని, ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ధర్మపురి, మార్చి 6: ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూరుగుపల్లి గ్రామ శివారులో గల మామిడితోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు గురువారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 3500 నగదు, 156000 రూపాయల విలువ గల కాయిన్స్, 9 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో సీసీఎస్ సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రమేశ్ ఉన్నారు.

ఎమ్మెల్సీ స్థానాల్లో విజయంపై బీజేపీ సంబరాలు



జగిత్యాలలో స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు పై సంబరాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక పాతబస్టాండ్‌లో గల ఇందిరా చౌక్ సర్కిల్ వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరిబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, పట్టణ బీజేపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొక్కు. గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నలువాల తిరుపతి, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి కళావతి, పట్టణ అధ్యక్షురాలు దురిశెట్టి మమత పాల్గొన్నారు.

●**కోరుట్ల** : పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని అన్ని గ్రామాలలో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

●**మల్యాల:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం సాధించడం పట్ల మల్యాలలో బీజేపీ నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బింగి వేణు, మల్లేశం, ప్రసాద్, రమేష్, లత, రమ పాల్గొన్నారు.

●**రాయికల్:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్ గెలుపొందడం పట్ల మండలంలోని వీరాపూర్ గ్రామంలో సంబరాలు నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు దిండిగాల రాజేష్, ఉపాధ్యక్షులు మాద రాజేశం, దమ్మ రాజ్ కుమార్, ధనరేకుల మహేష్, దిండిగాల సాయి, కనికరపు శివ, ఏగోళ్లపు సాయి పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని గాంధీచౌక్ వద్ద బీజేపీ పట్టణ, మండల శాఖ ఆధ్వర్యంలో టపాసులు కాల్చుతూ, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆకుల మహేష్, రాయికల్ పట్టణ ప్రధాన కార్యదర్శి బొడగం శ్రీకాంత్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజశేఖర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

●**కథలాపూర్:** పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డి చినమల్లై గెలుపు పట్ల కథలాపూర్‌లో సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ వద్ద టపాసులు పేల్చి పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనందరెడ్డి, జిల్లా సత్యం, కొడిపల్లి అనిల్‌రెడ్డి, బండ అంజయ్య, మహేశ్ తదితరులు ఉన్నారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారి పై టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకుని చేసుకున్న సంబరాలు అంబరాన్నంటాయి. బీజేపీ పార్టీకి, పీఎం నరేంద్ర మోదీకి, అగ్రనేతలకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కన్నం అంజయ్య, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కట్ట మహేష్, యూత్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు సంగెం కళ్యాణ్, కొక్కు లక్ష్మణ్ పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి చిన్నమలై అంజిరెడ్డి విజయం సాధించడం పట్ల కొడిమ్యాలలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు బండ నరసింహరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చల్ల శ్రీనివాసరెడ్డి, మండల బీజేపీ నాయకులు ఏలేటి నర్సింహరెడ్డి, రాజేశం, రాకేష్, తిరుపతిరెడ్డి, చింజీవి, శ్రీనివాస్, భూమేష్, రాజు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై సర్వే

కోరుట్లరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో అక్రమ మట్టి తరలింపుపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు గనులు మరియు భూగర్భశాఖ జిల్లా అధికారి కేజై సింగ్ ఆధ్వర్యంలో సర్వేను నిర్వహించారు. గురువారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని మల్లన్నగుట్ట, కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ శివారులోని గుట్ట ప్రాంతంలో కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపి సంబంధిత వాహనాలను గుర్తించి కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చెపట్టిన అధికారులు రెండు జేసీబీలతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ట్రాక్టర్లకు జరిమాన విధించిన అధికారులు జేసీబీ సహాయంతో తవ్విన వాటి కొలతను తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఆర్ఐ రాజేందర్, మండల సర్వేయర్ కుమారస్వామిలతో పాటు రెవెన్యూ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కొడిమ్యాల, మార్చి6(ఆంధ్రజ్యోతి) : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందించాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. గురువారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో సీసీ టీవీల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కలిపిస్తూ సీసీలు లేని గ్రామాలలో వాటి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ క్రైం, 100 డయల్ విని యోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలను చేయాలన్నారు. పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టుతూ, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకుండా చర్యలు తీసుకో వాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. ఎస్పీ వెంట కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆశా కార్యకర్తలకు రక్షణ కల్పించాలి

జగిత్యాల అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా కార్యకర్తలకు రక్షణ కల్పించాలని సీఐటీయు మరియు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ చౌరస్తాకు చేరుకుని రోడ్డును నాలుగు వైపులా దిగ్బంధనం చేశారు. దీంతో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఎస్పీ రఘుచందర్, జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌లు ఆశావర్కర్లకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆశా కార్యకర్తలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు ఇందూరి సులోచన, జిల్లా లోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహా స్వామికి పట్టు వస్త్రాలు సమర్పణ

ధర్మపురి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి బీజేపీ రాష్ట్ర నాయకులు దామెర రాంసుధాకర్‌రావు-సంఘమిత్ర దంపతులు గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ఏటా బ్రహ్మోత్సవాలకు ముందు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉత్సవ మూర్తులకు ఆయన పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీహెచ్ రమణాచార్యా చేతుల మీదుగా రాంసుధాకర్‌రావు దంపతులు స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు దంపతులను ఆలయం పక్షాన ఆశీర్వచనం చేసి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సముద్రాల వంశీకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళా జలాల పంపిణీ

గొల్లపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లె గ్రామంలో ప్రయాగ్‌రాజ్ మహా కుంభామేళా త్రివేణి సంగమం నుంచి తీసుకువచ్చిన మహాజల ప్రసాదంను బీటీకె ట్రస్ట్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బొమ్మెన కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో తులతూగాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ నాయకులు కంది మహేష్, సామల కిరణ్ పాల్గొన్నారు.